‘అర్థం’ అయితేనే అనుమతి

- పెడనలో వారి రూటే.. సపరేటు
- ఇంటి నిర్మాణాలకు అనుమతులు కావాలంటే చేయి తడపాల్సిందే...!
- అడిగింది ఇవ్వకపోతే ముప్పతిప్పలు పెడుతున్న వైనం!


పెడన పురపాలక సంఘ కార్యాలయం

పెడన: ఇంటి నిర్మాణానికి అనుమతి కావాలంటే చేయి తడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ ప్రక్రియ సాగుతున్నా అనుమతి కోసం నిర్ణీత సమయం ఇస్తున్నా.. ఆ గడువులోపు ఏదో వంక పెట్టి పెడన పురపాలక సంఘ కార్యాలయంలో రిజెక్ట్ చేస్తున్న దుస్థితి ఎదురవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెడన పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి ప్రతి నిర్మాణానికి అనుమతులు తప్పనిసరి కావడంతో స్థలాన్ని, దానిలో నిర్మించే ఇంటిని, భవనం ప్రకారం రేటు సపరేటుగా నిర్ణయించి తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నా ఒక్కరికే కాదు మరో ఇద్దరికి కూడా ఇవ్వాలని దరఖాస్తుదారులతో నేరుగా ఆ విభాగంలోని వారు చెబుతుండటం గమనార్హం.

అనుమతులు ఇలా

పట్టణంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ప్లాన్ ఉండాలి. దీన్ని ప్రైవేటుగా ఎవరైనా ప్లాన్ గీయించుకున్నా దాన్ని పురపాలక సంఘంలో అప్రూవల్ చేయించుకోవాలంటే ముందుగా ఎల్‌టీపీ(లైసెన్స్ టెక్నికల్ పర్సన్) నుంచి అనుమతులతో పాటు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఫీజుల వివరాలను ఎల్‌టీపీలు సంబంధిత దరఖాస్తుదారులకు అందజేస్తారు. వీటిని సంబంధిత వార్డు సచివాలయంలోని ప్లానింగ్ కార్యదర్శులకు అందజేస్తే వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫీజులు కట్టించుకుని తమకు చెందిన లాగిన్‌లో అప్రూవల్ చేసి టౌన్ ప్లానింగ్ విభాగానికి పంపిస్తారు. ఇలా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించి టీపీవోకు పంపిస్తారు. వంద చదరపు గజాల్లోపు అయితే నేరుగా టీపీవో అనుమతులు మంజూరు చేయొచ్చు. వంద చదరపు గజాలు దాటితే మాత్రం మున్సిపల్ కమిషనర్ అనుమతులు ఇవ్వాలి. ఇలా ప్రతి అధికారి, సిబ్బంది ఎవరికి వారే తమకు చెందిన లాగిన్‌లో వారే అనుమతులు మంజూరు చేస్తూ పైస్థాయి అధికారులకు పంపిస్తూ ఉండాలి. ప్లానింగ్ కార్యదర్శుల వద్ద లాగిన్‌లో ఓకే అయితే మూడు రోజులు మించి ఉండదు. నేరుగా టౌన్‌ప్లానింగ్‌కు ఫార్వర్డ్ అయిపోతుంది. టీపీవో వద్ద మాత్రం పెండింగ్‌లో పడిపోతుంది.

ఎల్‌టీపీల నుంచే మొదలు..

ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు కోసం ఎల్‌టీపీల నుంచే చేయి తడపాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇక్కడ కాదని ముందుకు వెళ్తే వారి వాటా వారికి అందకపోతే మాత్రం ‘ప్లానింగ్’ వద్దే పూర్తిస్థాయిలో బ్రేక్ పడిపోతుందని సమాచారం. నిర్ణీత సమయం దగ్గర పడుతుందనిపిస్తే ఏదో ఒక కొర్రి చూపుతూ సంబంధిత దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.5వేలు మొదలు రూ.20వేలు వరకు డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఒక వ్యక్తి తన భవన నిర్మాణానికి ఎల్‌టీపీ ద్వారా దరఖాస్తు చేస్తే రూ.7వేలు డిమాండ్ చేసినట్లు సమాచారం. నా ఒక్కరికేనా.. నాతో పాటు మరో ఇద్దరు కూడా ఉన్నారు..వారికి కూడా ఇవ్వాలంటూ చెప్పడం గమనార్హం. విసిగిన సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించడానికి ఉద్రిక్తులయ్యారు. ఇలా అయితే ఇబ్బందులు పడతావని పెద్దలు అతనికి చెప్పడంతో ఏడు వేలు సమర్పించుకుని ప్లాన్ అప్రూవల్ చేయించుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

ప్లానింగ్ సెక్రటరీల విస్మయం

కొత్తగా వచ్చిన అధికారి ‘ప్లానింగ్’ చూస్తూ వార్డు సచివాలయాల్లోని కొందరు ప్లానింగ్ సెక్రటరీలు విస్తుపోతున్నారు. దీంతో కొందరు ప్లానింగ్ కార్యదర్శులు సదరు అధికారికి వత్తాసు పలుకుతుండగా మరికొందరు దూరంగా ఉంటున్నారు. సదరు అధికారికి వత్తాసు పలుకుతున్న కార్యదర్శులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అందరికి నోటీసులు ఇస్తున్నాం.. గిట్టని వారు చేస్తున్న ప్రచారం



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వారందరికీ నోటీసులు జారీ చేస్తున్నాం. నిబంధనల మేరకు కాకుండా కొందరు రోడ్డుపైకి, శ్లాబులు, ర్యాంపులు నిర్మించుకున్నారు. ఇటువంటి వారికి నోటీసులు ఇచ్చాం. ఇస్తున్నాం. బాగా పనిచేస్తున్న వారిపై ఇటువంటి ఆరోపణలు సహజం. ఆరు నెలలుగా 33 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో 32 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశాం. ఒకదాన్ని మాత్రమే రిజెక్ట్ చేశాం.

–బి.సుజనాకుమారి, టీపీవో, పురపాలక సంఘం, పెడన

నా దృష్టికి రాలేదు.. ప్లానింగ్ వారిని పిలిపించి మాట్లాడతా..



టౌన్ ప్లానింగ్‌లో అనుమతుల కోసం చేయి తడపాల్సిందేనన్న విషయం ఇంత వరకు నా దృష్టికి రాలేదు. సంబంధిత టౌన్ ప్లానింగ్ విభాగంలోని వారందరిని పిలిచి హెచ్చరిస్తా. ఎవరైనా దరఖాస్తుదారులు నేరుగా తనకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాను. సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తాను.

–ఎం.గోపాలరావు, మున్సిపల్ కమిషనర్, పెడన

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు పెడన మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలోని నాలుగు అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి


చుక్కా నరసింహారావు(ఫైల్)

పెడన: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం సీనియర్ నాయకుడు చుక్కా నరసింహారావు (65) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహం వద్ద పలువురు నేతలు నివాళులర్పించారు.

కృష్ణా వర్సిటీ మహిళా హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్ బాల్ పోటీలు మంగళవారం కేబీఎన్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించే ఈ పోటీలలో ఆంధ్ర లయోలా కళాశాల (విజయవాడ), సిద్ధార్థ మహిళా కళాశాల (విజయవాడ), డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (మైలవరం), పద్మావతి హిందూ మహిళా కళాశాల (మచిలీపట్నం), కేబీన్ కళాశాల (విజయవాడ) జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిలను వర్సిటీ జట్టుగా ఎంపిక చేసి త్వరలో తమిళనాడులో జరగబోయే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల స్త్రీల హ్యాండ్ బాల్ పోటీలకు పంపించనున్నారు. పోటీలను హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీ శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల ఏవో డాక్టర్ వి.నారాయణ రావు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ‘మయసభ– దుర్యోధనుడు ఏకపాత్రాభినయం’ ఎంతో ఆకట్టుకుంది. మోపిదేవికి చెందిన శివశక్తి మురళీ కోలాటంలో గురువు ఆదిశేషు చిన్న, పెద్దలతో వేసిన కోలాటం ఆకర్షించింది. చిన్నారులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి అలరించారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో కప్పలదొడ్డి విద్యార్థుల సత్తా



గూడూరు: గోగినేనిపాలెంలో జరుగుతున్న 84వ గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ పోటీల్లో బాలుర సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో గూడూరు మండలం కప్పలదొడ్డి హైస్కూలు క్రీడాకారులు సత్తాచాటారు. ఫైనల్స్‌లో లింగారెడ్డిపాలెం జట్టుపై ఘనవిజయం సాధించి విజేతగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.జ్యోతి తెలిపారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, ఎస్ఎంసీ చైర్మన్ బి.కోటశివకృష్ణ క్రీడాకారులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ మురళీకృష్ణను అభినందించారు.

గోగినేనిపాలెం(ఘంటసాల): గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ ఆటల పోటీలు మంగళవారం రాత్రి హోరా హోరీగా సాగుతున్నాయి.

ఘంటసాల పీహెచ్‌సీకి బెడ్‌షీట్లు అందజేత



ఘంటసాల: ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి దోనేపూడి వెంకట రామకృష్ణ చౌదరి సహకరించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు అన్నారు. ఘంటసాల పీహెచ్‌సీకి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దోనేపూడి వీర రాఘవేంద్రరావు (పీసు బాబు) జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట రామకృష్ణ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన తొమ్మిది బెడ్ షీట్లను పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్‌కు మంగళవారం అందించారు. పీహెచ్‌సీ అభివృద్ధిలో ఇటీవల రోగులకు అవసరమైన రూ.50 వేల విలువైన ఆధునిక బెడ్‌ను అందించారు. కార్యక్రమంలో గొర్రెపాటి వెంకట రామకృష్ణ (ట్రస్టీ), గొర్రెపాటి జగన్మోహన రావు, వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయాల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు.. ఆర్టీసీ బస్సులు



మచిలీపట్నంటౌన్: మహా కుంభమేళాకు ఏపీఎస్ ఆర్టీసీ మచిలీపట్నం డిపో ఏర్పాటు చేసిన రెండు స్టార్ లైనర్ బస్సులు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరాయి. బస్సులను డిపో మేనేజర్ పెద్దిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూరి, కోణార్క్, గయ, బుధగయ, వారణాసి, అయోధ్య పుణ్యక్షేత్రాల దర్శనం చేసికొని ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలో కుంభమేళాకు ఈ బస్ సర్వీస్‌లు వెళతాయన్నారు. తిరిగి అక్కడి నుంచి ఈ నెల 12వ తేదీన ఈ సర్వీస్‌లు మచిలీపట్నం చేరతాయన్నారు. కుంభమేళాకు ఈనెల 9, 14 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. స్లీపర్ బస్సు చార్జీ రూ.15,500, సూపర్ లగ్జరీ చార్జీ రూ.12,500గా నిర్ణయించారని చెప్పారు

బీసీ బాలికల వసతి గృహానికి మూడు సీసీ కెమెరాలు, ఇన్వర్టర్

అవనిగడ్డ: స్థానిక బీసీ బాలికల వసతి గృహానికి రిటైర్డ్ బ్యాంకు అధికారి అద్దంకి సుబ్బారావు మూడు సీసీ కెమెరాలు, ఇన్వర్టర్ అందించారు. స్థానిక వసతి గృహంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా వీటిని వసతి గృహానికి అందించారు. విద్యార్థినిలకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, పెద బాలశిక్ష అందించారు. అనంతరం సుబ్బారావుని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వర రావు, వసతి గృహ అధికారులు, కూనపరెడ్డి చంద్రశేఖరరావు, జీవో నాగభూషణం పాల్గొన్నారు.

దినకర.. శుభకరా

ఘనంగా రథసప్తమి

వేకనూరు(అవనిగడ్డ): రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వేకనూరులో శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. అనంతరం పది వేల మందికి అన్నసమారాధన జరిగింది. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: రథసప్తమి సందర్భంగా స్థాబచ్చుపేటలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యాన నగరంలో శ్రీ సూర్యనారాయణ మూర్తి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కోనేరుసెంటర్లో రాష్ట్ర బీసీ సంఘ నేత కొనకళ్ల జగన్నాథం (బుల్లయ్య), తదితరులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఈవో ఆంజనేయస్వామి, దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఆజాద్ రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆదిత్య హృదయం పారాయణ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు. చల్లరాస్తా సెంటర్‌లోని శ్రీయతి రాజ భవనం నుంచి సూర్య ప్రభ వాహనం బయలుదేరింది. సూర్య భగవానుని సప్తమి దివ్య కిరణాలు, అక్కడ పర్యవేష్ఠితులైయున్న పెరుమాళ్ల పాదాల మీద పడగానే పూజలు చేశారు.

గూడూరు: మండలంలోని కంకటావ ప్రాథమిక పాఠశాలలో రథసప్తమిని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్‌బాబు ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు చేశారు.


వేకనూరులో స్వామివారి కల్యాణ మహోత్సవం


యతిరాజ భవనం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన సూర్యభగవానుడు

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సిందే

కలెక్టర్ డీకే బాలాజీ


పాతరామన్నపేటలో చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో కమిషనర్ బాపిరాజు, సిబ్బంది

మచిలీపట్నంటౌన్: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది వేర్వేరుగా సేకరించాల్సిందేనని కలెక్టర్ బాలాజీ చెప్పారు. బిన్స్‌లో తడి, పొడి చెత్తను వేరు చేసి అందించడంపై ప్రజలకు సచివాలయ స్థాయిలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ డీకే బాలాజీ, మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజుతో కలిసి మంగళవారం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ పాత రామన్నపేటలో పర్యటించారు. నగరంలో ఇంటింటికీ వెళ్లి మున్సిపల్ సిబ్బంది తడి, పొడి చెత్తను సేకరిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. కొన్నిచోట్ల తడి, పొడి చెత్తను ఒకే డస్ట్ బిన్‌లో వేయడాన్ని చూసి మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ మునిసిపల్ సిబ్బంది వ్యర్థాల నిర్వహణ విషయంలో క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది ప్రజలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలని, మనిషి ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు వీలుకల్పించే స్వచ్ఛత ప్రాధాన్యాన్ని తెలియజెప్పాలని ఆదేశించారు. హాట్‌స్పాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థను పరిశీలించి కలెక్టర్ బాలాజీ సంతృప్తి వ్యక్తం చేశారు. 45వ డివిజన్ సబ్‌జైల్ వెనుక భాగంలో వర్షాకాలంలో డ్రెయిన్ ముంపునకు గురవుతున్న నేపథ్యంలో కాల్వ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు కలెక్టర్ సూచించారు.

‘ఓఎన్జీసీ’పై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాభిప్రాయ సేకరణలో.. చూస్తాం..చేస్తామన్న అధికారులు


ఓఎన్జీసీ అధికారులను నిలదీస్తున్న అర్తమూరు–సాతులూరు గ్రామస్తులు

బంటుమిల్లి: ఓఎన్జీసీ చేపట్టనున్న పనులపై పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ఓఎన్జీసీ చేపట్టనున్న పనులపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మచిలీపట్నం ఆర్డీవో స్వాతి పర్యవేక్షణలో ఏపీ పర్యావరణ నియంత్రణ మండలి ఆధ్వర్యాన ఓఎన్జీసీ, పొల్యూషన్ బోర్డ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనులు, ఆయా ప్రాంతాల్లో భూమి స్వరూపంపై వివరించారు. అనంతరం సేకరణ సమయంలో ఓఎన్జీసీ అధికారుల తీరుపై ఆయా గ్రామాల రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్తమూరు, సాతులూరు, చినపాండ్రాక, గరిశపూడి తదితర గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు.. ఓఎన్జీసీ అధికారుల పనులు చేస్తామని చేయలేదని ధ్వజమెత్తారు. వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదని, ఈ నెల 11 లోపు వాటిని అమలుచేయకపోతే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట్రు బాయమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆర్డీఓ స్వాతికి వినతిపత్రం అందజేశారు. ములపర్రు పంచాయతీ పరిధిలోని మూలలంక రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసి తాగునీటి పైపులైను దెబ్బతిన కుండ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బొడ్డు మంగమ్మ వినతిపత్రం అందజేశారు. వీటిపై చూస్తాం.. చేస్తామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఓఎన్జీసీ తవ్వకాలు చేయాలంటే గ్రామస్తుల సహకారం అవసరమని, స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసి బాధ్యతగల అధికారిని నియమించాలని ఆమె ఆదేశించారు.

పెట్రోల్‌బంక్ పరిశీలన



కోనేరుసెంటర్: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీటాకీస్ సెంటర్‌లో కొనసాగుతున్న పోలీస్ పెట్రోల్ బంక్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పరిశీలించారు. బంకు నిర్వహణ, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. వినియోగదారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్ లో నాణ్యమైన ఇంధనం సరఫరా చేయాలని, కొలతల్లో మోసాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మరిన్ని చర్యలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు బందరు ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలో పర్యటించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే రద్దీ ప్రాంతాలను పరిశీలించారు. కోనేరుసెంటర్, పోర్ట్‌రోడ్డు, విజయవాడ రోడ్లలో పర్యటించిన ఆయన అక్కడి పరిస్థితులను డ్రోన్ కెమెరాతో స్వయంగా పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి భారీగేట్లు, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టంకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్, ఆర్ పేట సీఐ ఏసుబాబు, ఇనకుదురుపేట సీఐ ఎస్ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపునకు రంగం సిద్ధం..!


బందరులో బడ్డీలను తొలగించేందుకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న దుకాణదారులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఫైర్ స్టేషన్ పక్కన ఉన్న ఈడేపల్లి ప్రధాన డ్రెయిన్‌పై ఉన్న ఆక్రమిత బడ్డీలను తొలగించేందుకు నగరపాలక సంఘ అధికారులు సన్నద్ధమయ్యారు. డ్రెయిన్‌పై దాదాపు 15 మందికి పైగా చిరు వ్యాపారులు బడ్డీలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత మంగళవారం బడ్డీలను ఖాళీ చేయాలని కొద్ది రోజుల్లో వీటిని తొలగిస్తామని దుకాణదారులను హెచ్చరించారు. దీంతో వారు ఆందోళన చెందారు. వారంతా వారం రోజులుగా కూటమి నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బడ్డీలను తొలగించవద్దంటూ విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది మళ్లీ మంగళవారం ఈ బడ్డీలను తొలగించేందుకు పొక్లయిన్లతో సహా సిద్ధమయ్యారు. అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని హడావుడి చేశారు. దుకాణదారులు సమయం కావాలని కోరడం, కూటమి అంగీకారం తెలపడంతో తొలగింపును తాత్కాలికంగా నిలుపుచేశారు. తర్వాత దుకాణదారులు కమిషనర్ బాపిరాజును కలసి తమ గోడును విన్నవించుకున్నారు. మంత్రి రవీంద్ర, టీడీపీ నేత గోపీచంద్, 45వ డివిజన్ ఇన్‌చార్జి ఫణికుమార్‌ను కలిశామని వారు బడ్డీలను తొలగించబోమంటున్నారని తెలిపారు. సరే అంటూ కమిషనర్ కారెక్కి వెళ్లిపోయారు. అయితే కొద్ది రోజుల్లో వాటిని తొలగించనున్నారని విశ్వసనీయ సమాచారం.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



చల్లపల్లి(అవనిగడ్డ): వక్కలగడ్డలో కమల నెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వేములపల్లి రోజా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరి ఉమ, ఐపీఎం ఫౌండేషన్ చైర్మన్ వేములపల్లి సురేష్, మహిళా సమాఖ్య నాయకురాలు మల్లుపెద్ది రత్నకుమారి, హనుమానుల రాణికుమారి, శిక్షణకురాలు నాగమణి, హనుమానుల సురేంద్రనాథ్‌బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో ‘శ్మశాన’ వివాదం

రోడ్డుపై ధర్నా చేసిన శారదానగర్‌వాసులు


కృష్ణా యూనివర్సిటీకి వెళ్లే రోడ్డుపై ధర్నా చేస్తున్న శారదనగర్ వాసులు

కోనేరుసెంటర్: బందరు మండలం రుద్రవరంలోని శ్మశాన వాటిక విషయంలో ఏర్పడిన వివాదం ధర్నాకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం శారదనగర్‌కు చెందిన మెరుగు జ్యోతి ఏడాది క్రితం చనిపోయింది. రుద్రవరం పంచాయతీ పరిధిలోని శ్మశాన వాటికలో ఆమెను ఖననం చేశారు. మృతురాలి కుటుంబం వేరే ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడడంతో ఇక్కడ సమాధి కట్టకూడదనే షరతుపై శారదనగర్ వాసులు అక్కడ ఖననం చేసేందుకు అంగీకరించారు. ఇది ఇలా ఉండగా తల్లిపై ప్రేమతో ఆమె కుమారుడు రెండు రోజులు క్రితం ఇక్కడ సమాధి కట్టించాడు. విషయం తెలుసుకున్న శారదానగర్ వాసులు మంగళవారం శ్మశాన వాటిక ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. పోలీసులకు ఆందోళనకారులకు కాసేపు వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ మధుసూదనరావు, సీఐ ఏసుబాబు, ఎస్ఐ నాగరాజు శారదనగర్ వాసులను మండల తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి చర్చలు జరిపారు. అధికారుల ఆదేశాల మేరకు జ్యోతి కుటుంబ సభ్యులు సమాధిని గోపురం వరకు తొలగించి సహకరించారు. అయితే ధర్నా జరగడంతో శారదనగర్ నుంచి కృష్ణా విశ్వవిద్యాలయంకు వెళ్లే రహదారి పూర్తిగా దిగ్బంధం కావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసుల అధికారులు చర్యలు తీసుకోవడంతో వాహనాల రాకపోకలు సాగాయి.

కనులపండువగా భావనారుషిస్వామి కల్యాణం

కోడూరు: స్థానిక పంచాయతీ పరిధిలోని ఐదో వార్డులో ఉన్న భద్రావతి సమేత భావనారుషిస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఊరేగించారు. పెద్దఎత్తున అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చిన్నారుల ఫ్యాన్సీడ్రెస్ పోటీలు

కోడూరు: బాలోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరిగాయి. బబాలోత్సవ బహిరంగ వేడుకను త్వరలోనే నిర్వహించనున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు చెప్పారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కోనేరుసెంటర్: ఆరోగ్యమే మహాభాగ్యమని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సాయిసుస్వర అన్నారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని తాళ్లపాలెం, చిన్నాపురం పీహెచ్‌సీల సిబ్బంది మంగళవారం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ప్రతి పది మందిలో ఒకరు క్యాన్సర్‌తో మరణిస్తున్నారన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. మగవారు చెడు వ్యసనాలతో క్యాన్సర్ బారిన పడుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇవోలు కృపారావు, పరమేశ్వర రావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.